www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 27-9-2025 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 163

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి మ.12:04 తదుపరి షష్ఠి, నక్షత్రం: అనూరాధ రా.1:08, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.6:08-7:43, అమృతఘడియలు: మ.1:26-3:14, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 6:08, సూర్యాస్తమయం: 6:03

సంగారెడ్డి, మెదక్ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం : మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సహజావుగా జరిగేందుకు ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాలెట్ బాక్సుల వినియోగం, అధికారుల నియమాకం, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బ్యాలెట్ విధానంలో ఎన్నికల నిర్వహణ ఉంటుందన్నారు. జిల్లాలో 2,549 మంది ప్రిసైడింగ్ అధికారులకు ఐదు కేంద్రాల్లో శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 492 గ్రామ పంచాతీల్లో 4,220 వార్డుల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 190 ఎంపీటీసీ, 21 జడ్పీటీసీ స్థానాలకు 1,052 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎలయ్య పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


మహాలక్ష్మి అవతారంలో కొలువుదీరిన వనదుర్గమాతను కుటుంబంతో కలిసి దర్శించుకున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మహాలక్ష్మి అవతారంలో వనదుర్గామాత

పాపన్నపేట సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గోకుల్‌షెడ్డుల్లో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో ఐదో రోజు శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో (స్కందమాత) పెసరరంగు వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన ఆలయం చుట్టూ వరద ప్రవాహం కొనసాగుతుండటంతో రాజగోపురంలో అమ్మవారి ఉత్సవాన్ని ప్రతిష్ఠించి నిత్యపూజలు చేస్తున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, నవరాత్రి పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ కుటుంబంతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో శుక్రవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల (టీఎన్‌జీవో) సంఘం ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ సంబరాల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. వేడుకలకు హాజరైన నిర్మలాజగ్గారెడ్డికి టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్‌అలీ, మహిళా ప్రతినిధులతో కలిసి అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి నిర్మలాజగ్గారెడ్డి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, నాయకులు రవి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో టీఎన్‌జీవో సంఘం ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి


సంగారెడ్డి ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు

ప్రేమించి మోసపోయా..

లవ్ జిహాదీకి బలయ్యా..

ఓ యువతి ఫిర్యాదు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): లవ్ జిహాద్ కుట్రలో మోసపోయానని ఓ యువతి సంగారెడ్డి ఎస్పీకి శుక్రవారం ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి నవోదయ కాలనీకి చెందిన దళిత యువతి హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌కు చెందిన అబ్దుల్ ఫరీద్ అనే యువకుడిని ప్రేమించి, 2023లో ఇస్లాం పద్ధతిలో వివాహం చేసుకున్నది. పెళ్లికి ముందు నచ్చిన మతాన్ని ఆచరించవచ్చని నమ్మబలికి, తరువాత బలవంతంగా ముస్లిం మతాచారాలు పాటించేలా చేశాడని బాధితురాలు ఆరోపించింది. బురఖా ధరించాలని, గోమాంసం తినాలని బలవంత పెట్టసాగాడని, ఒప్పుకోకపోవడంతో కొట్టి హింసించేవాడని తెలిపింది. తనకు బిడ్డ పుట్టిన తరువాత వదిలేసి ఇంకో వివాహం చేసుకున్నాడని వాపోయింది. ప్రేమ పేరిట తనలా మరెవరి జీవితం నాశనం చేసుకోవద్దనే ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నది. బాధితురాలితో పాటు వీహెచ్‌పీ ధర్మప్రసార్ స్టేట్ కో కన్వీనర్ సుభాష్ చందర్, జిల్లా కార్యదర్శి జయరాంరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండాపురం జగన్, బజరంగ్‌దళ్ నాయకులు లక్ష్మణ్, సృజన్, అఖిల్ ఉన్నారు.

పల్లె బరి.. నేతల గురి..

రిజర్వేషన్లపై టెన్షన్

అదిగో.. జాబితా అంటూ వైరల్

కొట్టిపారేస్తున్న అధికారులు

నోటిఫికేషన్ దసరా తర్వాత ప్రకటిస్తే మేలంటున్న ఆశావహులు

పండుగల నేపథ్యంలో ఖర్చుపై ఆందోళన

అదిగో పులి అంటే ఇదిగో తోక... అన్నట్లుగా తయారైంది గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ వ్యవహారం. తమ గ్రామాలు, మండలాల రిజర్వేషన్లను తెలుసుకునేందుకు ఆశావహులు ఉత్సాహం చూపుతున్నారు. కార్యదర్శి నుంచి కలెక్టరేట్ దాకా ఆరా తీస్తున్నారు. ఇందుకు తగినట్లే చివరకు కొన్ని జాబితాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. వీటిని అధికారులు కొట్టిపారేస్తున్నప్పటికీ బయటకు ఎలా వచ్చాయో అంతుబట్టకుండా ఉంది. ఇది నిజమా.. అబద్ధమా అనే విషయంలో స్పష్టత కొరవడింది. మొత్తానికి ఎన్నికల వార్తల వేళ పల్లెల్లో వాతావరణం వేడెక్కింది.



సంగారెడ్డి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏ క్షణంలోనైనా పరిషత్ లేదా గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయొచ్చని రాష్ట్ర ప్రభుత్వం సంకేతాలిచ్చింది. దీంతో అందరి దృష్టి రిజర్వేషన్లపైకి మళ్లింది. రిజర్వేషన్ కలిసి వస్తేనే పోటీ చేస్తామనే ఆలోచనలో ఉన్న ఆశావహులు ప్రస్తుతం ఆగమాగం అవుతున్నారు. రిజర్వేషన్లపై రకరకాల ప్రచారం జరుగుతున్న క్రమంలో ఉత్కంఠ నెలకొంది.

సంగారెడ్డి ఎస్సీ.. మెదక్ ఓసీ..!

సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ రిజర్వేషన్‌ను ఎస్సీ సామాజిక వర్గానికి, మెదక్ జడ్పీ జనరల్ వర్గానికి కేటాయించినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించిన కొన్ని పత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది వాస్తవమా.. అవాస్తవమా అనే విషయం తేలకుండా ఉంది. గత ఎన్నికల్లో సంగారెడ్డిని జనరల్ మహిళకు, మెదక్‌ను బీసీ మహిళకు కేటాయించారు. ఈక్రమంలో రెండు జిల్లాల రిజర్వేషన్లను మారుస్తారనే అంచనా ఉంది. ఇందుకు తగినట్లు సంకేతాలు రావడంతో ఆయా వర్గాల్లో ఆశావహులు తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

రిజర్వేషన్ జాబితాలు లీక్

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాలకు సంబంధించిన రిజర్వేషన్ జాబితాలు లీకయ్యాయి. సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. కొన్ని పత్రాల రూపంలో ఉండగా.. మరికొన్ని కంప్యూటర్‌లోనే ఫొటోలు కొట్టి బయటకు లీక్ చేసినట్లుగా తెలుస్తోంది. ఆశావహులు అత్యుత్సాహంతో వీటిని సేకరించారా.. లేక కార్యాలయాల సిబ్బందే లీక్ చేశారా అనే విషయం తేలాల్సి ఉంది. దీనిపై జిల్లా అధికారులను అడిగితే కొట్టిపారేస్తున్నారు. తాము అన్ని జాబితాలను ప్రభుత్వానికి నివేదించామని.. పూర్తిస్థాయిలో గోప్యత పాటిస్తున్నట్లు చెబుతున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు సర్పంచ్‌ల రిజర్వేషన్ల జాబితాలూ చక్కర్లు కొడుతున్నాయి.

పండుగ ఖర్చుపై దడ

ఎన్నికల బరిలో నిలవాలనుకునే ఆశావహులు దసరా ఖర్చుకు భయపడుతున్నారు. దసరా తర్వాతనే రిజర్వేషన్లు ప్రకటిస్తే తమకు అనుకూలంగా ఉంటుందని కోరుతున్నారు. రిజర్వేషన్లు ముందే ప్రకటిస్తే

మిగతా 4వ పేజీలో


సంగారెడ్డిలో ప్రారంభానికి సిద్ధమైన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్

ప్రారంభానికి ఏటీసీలు సిద్ధం

నైపుణాభివృద్ధికి బాటలు, ఉపాధికి బాసట

'టాటా' సంస్థ సహకారంతో రూ.41 కోట్లతో ఏర్పాటు

నేడు ప్రారంభించనున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో టాటా సంస్థల సహకారంతో ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. యువతలో నైపుణ్యం పెంపొదించడం, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడం, మారుతున్న కాలానికి, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడం కోసం ఐటీఐలను అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సంగారెడ్డిలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ఏటీసీ భవనానికి గతేడాది జూన్‌లో శంకుస్థాపన చేశారు. పనులు పూర్తికావడంతో నేడు మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించనున్నారు. హత్నూర మండల కేంద్రంలోని ఐటీఐ ప్రాంగణంలో నిర్మించిన ఏటీసీని ఎమ్మెల్యే, కలెక్టర్ సమక్షంలో ప్రారంభించనున్నారు.

ఆధునిక వసతులతో మెరుగైన శిక్షణ

సంగారెడ్డిలో 'టాటా' టెక్నాలజీ సహకారంతో రూ.41 కోట్ల అంచనాతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో శిక్షణ ఇచ్చేందుకు కంప్యూటర్ న్యూమరికల్స్(సీఎన్‌సీ) మిషన్స్‌తో పాటు ఆధునిక యంత్ర పరికరాలను ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ద్వారా సమకూర్చారు. ఏటీసీ ఏర్పాటులో భాగంగా ఇప్పటికే 2024-25 విద్యాసంవత్సరంలో ఆరు ట్రేడ్లతో అడ్మిషన్లు ప్రారంభించారు. 172 మంది విద్యార్థులు ఆయా ట్రేడ్లలో అడ్మిషన్లు పొందారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు టాటా టెక్నాలజీ సంస్థతో పాటు ఇతర పారిశ్రామిక సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటీసీ అందుబాటులోకి రావడంతో ఉపాధి అవకాశాలు పెరురుగుతాయని సంగారెడ్డి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ డి.తిరుపతిరెడ్డి తెలిపారు. హత్నూర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏటీసీని నేడు ఎమ్మెల్యే, కలెక్టర్ సమక్షంలో ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అడుగడుగునా అడ్డంకులే!



765డీజీ హైవే నిర్మాణంలో ఎడతెగని జాప్యం

ఆరు నెలలుగా నిలిచిన పనులు

భూనిర్వాసితుల ఆందోళన

3

'పోషణ' నిధులకు కటకట



రెండేళ్లుగా టీబీ బాధితుల ఖాతాలో నిలిచిన నగదు జమ

తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు

పౌష్టికాహార నగదు కోసం తప్పని ఎదురుచూపులు

3

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి నీలిమ తీర్పు ఇచ్చినట్లు మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మూడు సంవత్సరాల క్రితం చిన్నశంకరంపేట మండలంలోని సంగాయిపల్లి గ్రామానికి చెందిన చెవ్వ ప్రవీణ్ పాత కక్షలతో అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణపై పొలం వద్ద కర్రలతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. అప్పటి ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కేసు నమోదు చేశారు. విచారణ అధికారి అప్పటి సీఐ గంగాధర్, ప్రస్తుత సీఐ వెంకటరాజాగౌడ్ విచారణలో సాక్ష్యాధారాలను సేకరించారు. ఈమేరకు కోర్టు తీర్పు వెల్లడించింది. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ వెంకటేష్, లైసోనింగ్ ఆఫీసర్ ఎస్‌ఐ విఠల్, సీడీవో అశోక్ సహకరించినట్లు ఎస్పీ తెలిపారు.

తొలి రోజు దరఖాస్తులు నిల్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో మద్యం కొత్త దుకాణాల ఏర్పాటుకు శుక్రవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. సంగారెడ్డిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అక్టోబరు 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. తొలి రోజు ఒక్క దరఖాస్తు కూడా రాలేదని అధికారులు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 101 మద్యం దుకాణాలుండగా ఎస్సీలకు 13, ఎస్టీలకు 2, గౌడ్స్‌కు 9, జనరల్‌కు 77 దుకాణాలు కేటాయించారు. ఎస్సీ జాబితాలో వట్‌పల్లి, హత్నూర, ఝరాసంఘం, జిన్నారం, బొల్లారం, అమీన్‌పూర్, ఇంద్రేశం, ఇస్నాపూర్ షాప్ నంబరు 5, పటాన్‌చెరు షాప్ నం-4, కొండాపూర్ షాప్ నం-2, సదాశివపేట షాప్ నం-4, కంగ్టి మండలం తడ్కల్, నిజాంపేట దుకాణాలున్నాయి. ఎస్టీలకు కోహీర్ మండలం కవేలి, జిన్నారం మండలం సోలక్‌పల్లి దుకాణాలు కేటాయించారు. గౌడ్స్ జాబితాలో రాయికోడ్, జహీరాబాద్ షాప్ నం-3, తెల్లాపూర్ షాప్ నం-4, పటాన్‌చెరు షాప్‌నం-3, రామచంద్రపురం షాప్ నం-6, కొండాపూర్ షాప్ నం-1, కంది షాప్ నం-1, సంగారెడ్డి షాప్ నం-4, కోహీర్ దుకాణాలను కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు.

మెదక్‌లో మూడు కౌంటర్లు


శ్రీనివాస్‌రెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం కొత్త లైసెన్స్‌లను జారీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మెదక్ జిల్లాలోని 49 దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ కోసం మెదక్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో మూడు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 23న జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వరగార్డెన్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో కొత్త లైసెన్స్‌ల కోసం లక్కీడిప్ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో మెదక్, నర్సాపూర్, రామాయంపేట సర్కిల్ సీఐలు నాగేశ్వర్‌రావు, గులాం ముస్తఫా, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జాతీయ రహదారిపై వరద నీరు నిలవడంతో ముందుకు కదలని వాహనాలు


సంగారెడ్డి పట్టణంలోని ఓ కాలనీలో ఇళ్లలోకి చేరిన నీరు

వాన జోరు.. జనం బేజారు

సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు

జిల్లాకేంద్రంలో నీట మునిగిన కాలనీలు

హైవే 65పై నిలిచిన రాకపోకలు

సంగారెడ్డి టౌన్/పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సంగారెడ్డి పట్టణంలోని అస్తబల్, గాయత్రినగర్, రిక్షాకాలనీ, మధురానగర్ తదితర కాలనీల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో వార్డుల్లోకి వర్షపు నీరు చేరింది.

హైవే 65పై ట్రాఫిక్‌జాం

జహీరాబాద్ నుంచి సంగారెడ్డి మీదుగా లింగంపల్లి వరకు ఉన్న 65వ జాతీయ రహదారిపై పలుచోట్ల వరద నీరు పారడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ అయ్యింది. పటాన్‌చెరు మండలంలో చెరువులు అలుగు పారడంతో ఇస్నాపూర్ నుంచి లక్డారం వరకు హైవేపై వరద నీరు పారింది. పోలీసులు పాశమైలారం, ఇంద్రకరణ్ వైపు వాహనాలను దారి మళ్లించారు. ముత్తంగి వద్ద ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్డు పైనుంచి నక్కవాగు ప్రవహించింది. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద వరద కాల్వపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేక హైవేపై నిలిచిపోయింది.

కంగ్టిలో 11.9 మి.మీ..

సంగారెడ్డి జిల్లాలో సగటున 9 సెం.మీ.ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా కంగ్టి మండలంలో 11.69, సిర్గాపూర్‌లో 10, కల్హేర్‌లో 8, అందోల్‌లో 9 జిన్నారంలో 10 అమీన్‌పూర్‌లో 8, పుల్‌కల్‌లో 11, కందిలో 7, రామచంద్రపురంలో 8, ఝరాసంగంలో 10, మొగుడంపల్లిలో 8, నారాయణఖేడ్‌లో 9, కొండాపూర్‌లో 7, పటాన్‌చెరులో 7, సంగారెడ్డిలో 7, సదాశివపేటలో 6 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

- కోహీర్: మండలంలోని పీచేర్యాగడిలో ఊరెంట చెరువు కట్ట తెగి ఎస్సీ శ్మశాన వాటికలోకి వరదనీరు చేరింది.
- నారాయణఖేడ్: మండల పరిధిలోని హన్మంత్‌రావుపేట-మాద్వార్‌ల మధ్య రామసముద్రం వాగు పొంగడంతో రాకపోకలు నిలిచి పోయాయి.
- రానున్న 24 గంటలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు.

మెదక్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్

భయం గుప్పిట్లో మెతుకుసీమ

పొంగిపొర్లుతున్న వాగులు

4


హవేళిఘణపూర్‌లో వేపచెట్టుపై దుర్గమ్మ రూపం

దీవించమ్మా.. వేపచెట్టు దుర్గమ్మ

హవేళిఘణపూర్, సెప్టెంబరు 26 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయ ప్రాంగణంలోని వేపచెట్టుపై అమ్మవారి రూపాన్ని 2009 సంవత్సరంలో చెక్కించారు. హవేళిఘణపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేపచెట్టు దుర్గమ్మ దర్శనానికి భక్తులు తరలివస్తుంటారు. ప్రతియేటా దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలోని అమ్మవారితో పాటు వేపచెట్టుపై ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులు ఇక్కడే ఒడిబియ్యం సమర్పిస్తారు.

అడుగడుగునా అడ్డంకులే!

765డీజీ హైవే నిర్మాణంలో జాప్యం

ఆరు నెలలుగా నిలిచిన పనులు

బైపాస్ భూనిర్వాసితుల ఆందోళన

రామాయంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో జాతీయ రహదారి 765డీజీ విస్తరణ పనులు ఆరు నెలలుగా నిలిచిపోయాయి. 2019లో జాతీయ రహదారిగా మారిన ఈ రోడ్డు విస్తరణకు అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. రూ.882 కోట్ల కేంద్ర నిధులతో మెదక్ జిల్లా పరిధిలో 68 కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ పనుల్లో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. రామాయంపేట మండలంలో నాలుగు కిలోమీటర్ల అటవీ రహదారి విస్తరించి ఉంది. ఈ పనులకు కేంద్ర అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో గత మూడేళ్లుగా పనులు నిలిచిపోయాయి. ఇది ప్రాజెక్టు ఆలస్యానికి మరో ప్రధాన కారణంగా మారింది.


రామాయంపేట - మెదక్ దారిలో నిలిచిన జాతీయ రహదారి పనులు


చిన్నపాటి కుంటలా మారిన అక్కన్నపేట అండర్‌పాస్ నిర్మాణం

అసంపూర్తి పనులతో ప్రమాదాలు

మెదక్, సిద్దిపేట మార్గంలో అక్కడక్కడా పనులు అసంపూర్తిగా ఉండడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవలి వరదలకు నందిగామ శివారులో ఒక కల్వర్టు కుంగిపోవడం వల్ల సిద్దిపేట - రామాయంపేట రహదారిపై పదిహేను రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. పాత బ్రిడ్జిని ఉపయోగించడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని, ఇది కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు ఆరోపిస్తున్నారు. తొనిగండ్ల వద్ద బైపాస్ పూర్తయినా, అండర్‌పాస్ నిర్మాణంతో అక్కన్నపేట గ్రామం అతలాకుతలమైంది. గ్రామం చివరి నుంచి నిర్మిస్తున్న అండర్‌పాస్ పనుల్లో జాప్యం నెలకొనడంతో గ్రామస్థులకు అసౌకర్యం కలుగుతోంది.

రామాయంపేట బైపాస్ వివాదం

రామాయంపేట మండలంలో మూడు బైపాస్‌ల ఏర్పాటు తలనొప్పిగా మారింది. హైదరాబాద్ వైపు ఉన్న విలువైన 33.20 ఎకరాల భూములు కోల్పోవాల్సి రావడంతో, 70 మంది నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారు. ఆరేళ్లుగా ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో బైపాస్ పనులు ఆలస్యమవుతున్నాయి. గతంలో 2016లోనూ హైదరాబాద్ బైపాస్‌కు భూములు ఇచ్చామని, మళ్లీ ఇప్పుడు మరో బైపాస్‌కు ఇవ్వలేమని వారు మొండికేస్తున్నారు. దీంతో నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో జాప్యం జరుగుతోంది. జిల్లా కేంద్రమైన మెదక్‌లో బైపాస్ చేయకుండా, రామాయంపేట వంటి మండలంలో మరో బైపాస్ నిర్మించడం దేనికని రైతులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

మలుపులు లేకున్నా.. తప్పని కుదుపులు

● కంకర తేలి, గుంతలమయంగా మారిన రాయిపల్లి రోడ్డు

నారాయణఖేడ్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే అత్యంత ప్రత్యేకమైన రోడ్డుగా పేరుగాంచిన రాయిపల్లి - మెటల్‌కుంట రహదారి అధోగతికి చేరింది. 47 కిలోమీటర్ల దూరం మలుపులు లేకుండా ఉండే ఈ రోడ్డుపై ప్రస్తుతం ప్రయాణం చేయాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అల్లాదుర్గం క్రాస్ రోడ్డు నుంచి వట్‌పల్లి, రాయిపల్లి, హద్నూర్ మీదుగా జహీరాబాద్, బీదర్ వరకు ఉన్న ఈ రహదారి ప్రస్తుతం కంకర తేలి, గుంతలమయంగా మారింది. దీనికి తోడు, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతల్లో నీరు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. రాయికోడ్ క్రాస్ రోడ్డు నుంచి రాయిపల్లి క్రాస్ రోడ్డు వరకు కొన్ని చోట్ల మోకాలి లోతు గోతులు ఏర్పడ్డాయి. రాయిపల్లి వంతెన సమీపంలో రోడ్డు ప్రమాదకరంగా మారడంతో కొంత మేరకు మొరం వేసినప్పటికీ, మళ్లీ వర్షాలు కురవడంతో పరిస్థితి యథాతథంగా మారింది. జహీరాబాద్ - బీదర్, మెదక్ - జోగిపేట వైపు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణిస్తున్నారు. ఈ దారిలో రాకపోకలు 50 శాతానికిపైగా తగ్గిపోయాయి. ఆర్టీసీ బస్సులు తక్కువగా నడుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రధాన రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


రాయిపల్లి వంతెన సమీపంలో గుంతల్లో చేరిన నీరు


నారాయణఖేడ్-రాయిపల్లి రోడ్డు క్రాస్ రోడ్స్ సమీపంలో తేలిన కంకర


చిన్నకోడూరులో విక్రయిస్తున్న గునక, బంతి, చామంతి, పట్టి గుచ్చుల తదితర పువ్వులు

ఏడు రోజులకే సద్దుల సంబురం

చిన్నకోడూరు మండలం ఆరు గ్రామాల్లో నేడు పెద్దబతుకమ్మ

చిన్నకోడూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా అన్ని గ్రామాల్లో బతుకమ్మ పండగను తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. అమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. కానీ ఇందుకు భిన్నంగా చిన్నకోడూరు మండలంలోని మాచాపూర్, చిన్నకోడూరు, మెట్టుపల్లి, సలేంద్రి, కమ్మర్లపల్లి, అల్లీపూర్ గ్రామాల్లో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ పండగను జరుపుకుంటారు. అనాదిగా ఈ సంప్రదాయం కొనసాగుతున్నది. ఓసారి సద్దుల బతుకమ్మ పండగ వేడుకలను జరుపుకుని బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేయడానికి అందరూ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చే సరికి దొంగలు ఇళ్లల్లో చొరబడి విలువైన వస్తువులను దోచుకెళ్లారు. దీంతో అప్పటి నుంచి సద్దుల బతుకమ్మ పండగను తొమ్మిది రోజులకు కాకుండా, ఏడు రోజులకే చేస్తున్నట్లు ఓ కథ ప్రాచుర్యంలో ఉంది. అడవిలో సహజంగా దొరికే తంగేడు, గునగ, గడ్డి చామంతి, గడ్డి పువ్వు దొరకకపోవడంతో బంతి, చామంతి, పట్టగుచ్చుల పువ్వులకు గిరాకీ పెరిగింది.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

గుమ్మడిదల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండల కేంద్రంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడోరోజైన శుక్రవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక పూజ కార్యక్రమాలు అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ మద్దుల బాల్‌రెడ్డి, వంశంపార్య ధర్మకర్తలు పాలకమండలి సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్యాణం అనంతరం కవ్వం రవీంద్రారెడ్డి ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొని మహాప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, తహసీల్దార్ పరమేశ్వం, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పడమటి లక్ష్మారెడ్డి, ఇందేల బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తులసీదాసు, వంశపారంపర్య ధర్మకర్తలు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు

వృత్తి నైపుణ్యతతో మెరుగైన సేవలు

● మానవవనరుల అభివృద్ధి సంస్థ వైస్ చైర్‌పర్సన్ శాంతికుమారి


శిక్షణ యూనిట్‌లో శాంతికుమారి

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల వృత్తి నైపుణ్యం వల్ల సమాజానికి మెరుగైన సేవలందుతాయని మానవ వనరుల అభివృద్ధి సంస్థ వైస్ చైర్‌పర్సన్, డైరెక్టర్ జనరల్ శాంతికుమారి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ శిక్షణ యూనిట్‌ను శుక్రవారం ఆ సంస్థ వైస్ చైర్‌పర్సన్, డైరెక్టర్ జనరల్ శాంతికుమారి, కలెక్టర్ హైమావతితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శాంతికుమారి సంస్థ ద్వారా జిల్లాలోని ఉద్యోగులకు కల్పిస్తున్న శిక్షణ గురించి తెలుసుకున్నారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించాలని నిర్వాహకులకు ఆమె సూచించారు. ఎంసీహెచ్‌ఆర్‌డీ ద్వారా రెగ్యులర్‌గా స్ట్రెస్ మేనేజ్మెంట్, ఆఫీస్ మేనేజ్మెంట్, రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్, మహిళా సాధికారత, కమ్యూనికేషన్ స్కిల్స్, రెవెన్యూ శాఖ, గ్రామీణాభివృద్ధి అంశాలు, డాటా ఎంట్రీ ఆపరేషన్, శానిటేషన్ అండ్ హెల్త్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అందుకు తగిన వసతులను సిద్దిపేట కేంద్రంలో ఏర్పాటు చేశామని, ఏమైనా అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆమెతో పాటు అదనపు కలెక్టర్ గరీమాఅగ్రవాల్, డీపీవో దేవకీదేవి, ఎంసీహెచ్‌ఆర్‌డీ రీజనల్ ట్రైనింగ్ మేనేజర్ భిక్షపతి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా అంతర్రాష్ట్ర భజన పోటీలు


భవానీ మందిర్‌లో భజన చేస్తున్న బృందం సభ్యులు

జహీరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేవీనవరాత్రులు పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిర్‌లో అంతర్రాష్ట్ర భజన పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. భవానీ భజన మండలి ఆధ్వర్యంలో 2022 నుంచి ఇప్పటివరకు పోటీలను నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గొల్లభాస్కర్, సూర్‌రెడ్డి, మహేందర్ తదితరులు తెలిపారు. 23న ప్రారంభమైన పోటీలు 29న ముగుస్తాయని సభ్యులు పేర్కొన్నారు. నిష్ణాతులైన తిరుపతికి చెందిన స్వర్ణలత, జహీరాబాద్‌కు చెందిన శంకర్‌జ్యోషి, చింతామణిశర్మ ఆధ్వర్యంలో పర్యవేక్షించి నగదు ప్రోత్సాహకాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ ఏడాది నిర్వహించే పోటీల్లో కర్ణాటక నుంచి రెండు, మహారాష్ట్ర నుంచి రెండు, ఆంధ్రప్రదేశ్ ఒక బృందం, తెలంగాణలోని జోగులాంబ, సంగారెడ్డి, వికారాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన ఐదు భజన బృందాలు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. 27న సెమీఫైనల్, 29న ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో ప్రతిభను కనబర్చిన ఐదు భజన బృందాలకు నగదు ప్రోత్సాహకాలతో పాటు మెమొంటోను అందజేయనున్నారు.

'ఎల్లంకి'లో జాబ్ మేళాకు స్పందన


మెగా జాబ్‌మేళాలో కాలేజ్ కళాశాల యాజమాన్యం, తదితరులు

అమీన్‌పూర్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని బోర్డ్ ఆఫ్ అప్రెంటిషిప్ ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల మెగా జాబ్‌మేళా శుక్రవారం ముగిసింది. జాబ్‌మేళాలో 30 ప్రముఖ బహుళ జాతి సంస్థలు వందలాది మంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసుకున్నారు. ముగింపు కార్యక్రమానికి తెలంగాణా కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మెన్ బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.

గుమ్మడిదల-నర్సాపూర్ అటవీ మార్గంలో కారిడార్ ఏర్పాటుకు యత్నం

● మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్‌రావు

నర్సాపూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని 765డీ జాతీయ రహదారి గుమ్మడిదల - నర్సాపూర్ మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరించే అవకాశం లేక ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా కారిడార్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానని మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్‌రావు పేర్కొన్నారు. కారదిడార్ ద్వారా రోడ్డు మార్గం వేసే విధంగా డీపీఆర్ తయారు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. శుక్రవారం నర్సాపూర్‌లో బీజేపీ పార్టీ కార్యాలయం ప్రారంభించిన సందర్భంగా బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజల కోసం తపిస్తూ, తాను సన్యాసిగా మారి ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రధాని మోదీ నిరంతరం దేశం కోసం పనిచేస్తుంటే, ఏమీ తెలియని సన్నాసి రాహుల్ ప్రధాన ప్రతిపక్షంగా ఉండి ఏమి మాట్లాడుతున్నాడో కూడా తెలియని అయోమయ పరిస్థితి ఉందని విమర్శించారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబరు నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు బీజేపీ వారే ఉండేలా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్ గౌడ్, రాష్ట్ర సీనియర్ నాయకులు పెద్దరమేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నర్సాపూర్‌లో ఎంపీ రఘునందన్‌రావు, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


చాకలి ఐలమ్మకు నివాళి అర్పిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, తదితరులు

గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యం

● కోయిర్ బోర్డ్ మేనేజర్ ప్రసాద్

గుమ్మడిదల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ కోయిర్ బోర్డ్ మేనేజర్ ప్రసాద్ పేర్కొన్నారు. అమీన్‌పూర్ మండలంలోని పటేల్‌గూడ గ్రామానికి చెందిన మహిళలు శుక్రవారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో ఉన్న శ్రీసత్యనారాయణ కొబ్బరి పీచు పరిశ్రమను సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ క్వాయర్ బోర్డ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న మహిళలు, పరిశ్రమ వ్యవస్థాపకులు చెన్నంశెట్టి మౌనిక ఉదయ్‌కుమార్ మార్గదర్శకత్వంలో కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ పీచుతో తయారు చేసే వస్తువులను వివరించగా, మహిళలు ఆసక్తిగా విన్నారు. ఉపాధి సాధనలో ఇలాంటి చిన్న పరిశ్రమలు ఎంతో దోహదపడతాయని మహిళలు పేర్కొన్నారు.

టీబీ రోగుల 'పోషణ' నిధులకు కటకట

● రెండేళ్లుగా బాధితుల ఖాతాలో నిలిచిన నగదు జమ

● తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్షయ రోగులు

● పౌష్టికాహార నగదు కోసం తప్పని ఎదురుచూపులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : క్షయ (టీబీ) అదొక ప్రాణాంతకరమైన వ్యాధి. ఆ రోగాన బారిన పడిన వారి అవస్థలు అన్నీ, ఇన్నీ కావు. ఊపిరితిత్తులు అదిరేలా దగ్గు రావడం, సరిగ్గా ఆకలి కాకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలతో తీవ్ర అవస్థలు పడుతారు. శరీరం బక్కచిక్కి, బరువు తగ్గి అస్థిపంజరంలా మారిపోతారు. దీనిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణానికే ప్రమాదం. ఈ వ్యాధి బాధితులకు చికిత్స ఎంత ముఖ్యమే, పౌష్టికాహారం తీసుకోవడమూ అంతే అవసరం. అయితే, వీరికి చికిత్స కాలంలో పౌష్టికాహారం తీసుకునేందుకు ప్రభుత్వం 'నిక్షయ్ పోషణ యోజన' పథకంలో భాగంగా ప్రతీ నెలా రోగి ఖాతాలో నగదు జమ చేయాలి. కానీ రెండేళ్లుగా ఈ నగదు జమ ప్రక్రియ నిలిచిపోయింది.

టీబీ కేసుల వివరాలు

సంవత్సరం	రోగులు
2020	1,718
2021	1,750
2022	2,501
2023	2,322
2024	2,602
2025(ఆగస్టు)	1,739

రెండేళ్లుగా నిధులకు కటకట

క్షయ రోగులకు అవగాహన లోపం, పేదరికం కారణంగా పోషకాహారం తీసుకోరు. వీరికి ఆర్థికంగా తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ నెలా కొంత నగదును రోగి ఖాతాలో జమ చేస్తున్నది. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగిన మొదటి నెలలో ప్రతీ రోగి ఖాతాలో రూ.3 వేలు జమ చేస్తారు. ఆరు నెలల చికిత్స కాలం తర్వాత చివరి ఆరవ నెలలో మరో రూ.3 వేలు పోషకాహారం కోసం చెల్లిస్తారు. కానీ గతేడాది 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు పోషకాహారం నిధులు ప్రభుత్వం మంజూరు కాలేదు. దీంతో నిక్షయ్ పోషణ్ యోజన పథకం కింద సంగారెడ్డి జిల్లాకు 2024 ఏడాదిలో రూ.1,03,06,500, అదే విధంగా 2025 ఏడాది ఆగస్టు నెల వరకు రూ.1,04,34,000 నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని అధికారులు తెలిపారు.


సంగారెడ్డిలోని జిల్లా క్షయ నివారణ కార్యాలయం

నీరుగారుతున్న సర్కారు లక్ష్యం

దేశంలో క్షయ వ్యాధిని 2025 నాటికి పూర్తిగా పారదోలాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందు కోసం అధునాతన, ఖరీదైన యంత్ర పరికరాలు సమకూర్చడంతో పాటు ఎప్పటికప్పుడు రోగులకు సరిపడా మందులు పంపుతున్నది. కానీ, క్షయ వ్యాధిని పూర్తిగా పారద్రోలాలంటే సకాలంలో సరైన చికిత్సతో పాటు బలవర్ధకమైన పోషకాహారం తీసుకోవడం అత్యంత ఆవశ్యకం. ఈ పోషకాహార నిధులు విడుదల చేయపోవడంతో సర్కారు లక్ష్యం నీరుగారుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



శివంపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

పుల్కల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయుధ పూజ నిర్వహించారు. దసరా పండుగను పురస్కరించుకుని ట్రాన్స్‌కో ఏఈఈ సాయిరాఘవ ముఖ్య అతిథిగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ రంజిత, వంశీచంద్‌రెడ్డి, లైన్‌మెన్‌లు ఈశ్వర్, అనిల్‌కుమార్, రాజేష్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

'గీతం'లో జాతీయ ప్రిన్సిపాళ్ల సదస్సు

● హాజరైన 150 మంది ప్రధానోపాధ్యాయులు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ పాఠశాల ప్రిన్సిపాల్స్ శిఖరాగ్ర సదస్సు ప్రిన్సిపాల్స్ కొలోక్వియం 2025 పేరిట హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రారంభమైంది. ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్(పీఎస్‌పీఏ) సహకారంతో నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్‌ఈ, ఐబీ, జాతీయ పాఠశాలలకు చెందిన 150 మంది ప్రిన్సిపాళ్లు తరలివచ్చారు. 'ఉన్నత విద్యను తిరిగి ఊహించుకోవడం: నాయకత్వం, విధానం, ఆచరణ' అన్న అంశంపై నిర్వహిస్తున్న ఈ సదస్సులో విద్యా పర్యావరణ వ్యవస్థ కోసం పాఠశాలలు, ఉన్నత విద్య, పరిశ్రమలను అనుసంధానించే కార్యాచరణపై చర్చించనున్నారు. పీఎస్‌పీఏ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ స్వాగత ప్రసంగం చేయగా, గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, ఐఐటీ ఢిల్లీ ప్రొఫెసర్ సయ్యద్ హుసేన్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, ఎన్‌ఎస్‌ఏబీ సభ్యుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, పాన్ ఫిష్ సొల్యూషన్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ అనురాధరావు, గ్రీస్ విద్యావేత్త, పరిశోధకురాలు డాక్టర్ రాయినా లాంపో, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, డీన్ కోర్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి ఆయా అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


సదస్సులో పాల్గొన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు

న్యూస్ బాక్స్

'సమగ్ర చట్టం తేవాలి'

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్లు, తదితర కార్మికులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేసి, కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కల్హేర్/సిర్గాపూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సిర్గాపూర్ మండల పరిషత్ కార్యాలయం ముందు శుక్రవారం జీపీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఏరియా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ దసరా పండుగ ఉన్న సమయంలో కూడా వారి వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. అనంతరం ఎంపీపీ కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్మికులు సాయిలు, లాలయ్య, నర్సింలు, తుకారాం, లాల్ నాయక్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

నారాయణఖేడ్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదలైన అర్హులకు పథకాలను అందించేందుకు ప్రజా పాలన ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ పట్టణ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం 106 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 226 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్, పీఏసీఎస్ చైర్మన్లు శోభఅశోక్‌రెడ్డి, శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ సర్దార్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నాయకులు తాహెర్, హన్మంతు, నర్సింహులు, నారాయణ నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో జీవనోపాధి

కంగ్టి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కంగ్టిలో ఎస్‌బీఐ సహకారంతో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న కుట్టు శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఎంపీడీవో సత్తయ్య పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. మహిళలు ఇలాంటి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ నర్సింహులు, శిక్షకులు ఇస్తారి రాణి, శ్రీనివాస్, సీసీలు సంతోష్, కల్లప్ప, తుకారాం, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వంద ఎల్ఈడీ బల్బులు అందజేత

పుల్కల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చౌటకూర్ గ్రామ పంచాయతీకి పీఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పార్శల రాంరెడ్డి రూ.70 వేల విలువ గల వంద ఎల్ఈడీ బల్బులను అందజేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీడీవో శంకర్ సమక్షంలో కార్యదర్శి సందీప్‌గౌడ్‌కు అందజేశారు. అనంతరం దాత పార్శల రాంరెడ్డిని ఎంపీడీవో శంకర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుదీప్, మాజీ సర్పంచ్ భూంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పటాన్‌చెరు : చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


మెదక్‌లో ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


రామచంద్రాపురం టౌన్ : చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి


జహీరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో...

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శుక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ఆమె విగ్రహాలను ఆవిష్కరించారు, ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు ఆమె పోరాట స్ఫూర్తిని కొనియాడారు. రజక సంఘం నాయకులు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ స్ఫూర్తితో రజకులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అలాగే, పలువురు నాయకులు రజకులను ఎస్సీ కేటగిరీలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


పెద్దశంకరంపేటలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్

బతుకమ్మ ఘాట్‌ను ప్రారంభించిన ఎంపీ

జిన్నారం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం మాధారం, మంత్రికుంట గ్రామాలలో మెదక్ ఎంపీ రఘునందనరావు పర్యటించారు. మంత్రికుంటలో గురువారం రాత్రి బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రమణాసింగ్ సొంత నిధులతో నిర్మించిన బతుకమ్మ ఘాట్‌ను ఎంపీ రఘునందన్‌రావు ప్రారంభించారు. అనంతరం మాధారంలో ఏర్పాటు చేస్తున్న పంచముఖ హనుమాన్ విగ్రహాన్ని సందర్శించి, రూ.1.26లక్షల విరాళాన్ని అందజేశారు. ఆయా గ్రామాలలో దుర్గాదేవి మండపాలను సందర్శించి, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.


మంత్రికుంట బతుకమ్మ ఘాట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు

అధికారులు సమన్వయంతో పని చేయాలి

● ఎమ్మెల్యే సునీతారెడ్డి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా స్థానిక పంచాయతీ కార్యదర్శుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుని, వాటికి ఏమైనా నిధులు అవసరముంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వర్షాలు బాగా పడుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏ సమస్య రాకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా పాలకవర్గాలు లేనందున అధికారులే అన్ని తామై పనిచేయాలని అన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం విషయంలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ఏమైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మధులత, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

నారాయణఖేడ్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలను నిమజ్జనానికి కమలాపూర్ చెరువు వద్ద ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ బాధ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు వినతి పత్రం అందించారు. చెరువు వద్ద విద్యుత్ దీపాలు, క్రేన్, తాగునీరు తదితర ఏర్పాట్లను చేయాలని కోరారు.

రేగోడు సొసైటీ కమిటీని కొనసాగించాలి

రేగోడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రేగోడు వ్యవసాయ సహకార సంఘం సొసైటీ కమిటీని కొనసాగించాలని కోర్టు ఆదేశాలు వచ్చాయని రేగోడు పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మెదక్ జిల్లా సహకార శాఖ అధికారికి కోర్టు నుంచి వచ్చిన ఆదేశాలను అందజేశారు. జిల్లాలో వ్యవసాయ సహకార సంఘాల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం గత ఫిబ్రవరి, ఆగస్టు 14న రెండు సార్లు ఆరు నెలల చొప్పున పొడిగించిందన్నారు. అయినా జిల్లాలోని ఐదు సహకార సంఘాలకు కమిటీలను తప్పించి పర్సన్ ఇన్‌చార్జీలను నియమించిందన్నారు. అందులో రేగోడు సొసైటీ ఉండడంతో చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులు హైకోర్టును ఆశ్రయించగా, కమిటీని యథావిధిగా కొనసాగించాలని ఆదేశాలు ఇచ్చినట్లు రాజు యాదవ్ తెలిపారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత


బాలికను తల్లి స్రవంతికి అప్పగిస్తున్న పోలీసులు

వెల్దుర్తి, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తా వద్ద తప్పిపోయిన బాలికను వెల్దుర్తి పోలీసులు గంటల వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన వెల్దుర్తికి చెందిన ఉప్పల స్రవంతి కూతురు ఉప్పల చైత్రిక ఇంటి బయట ఆడుకుంటూ తప్పిపోయింది. బస్టాండ్ చౌరస్తా వద్ద ఏడుస్తూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. పోలీసులు సామాజిక మధ్యమాలలో బాలిక ఫొటోను ఉంచడంతో చూసిన తల్లి స్రవంతి, బాబాయ్ అశోక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా వారికి కౌన్సిలింగ్ నిర్వహించి బాలికను అప్పగించారు.

సొంత డబ్బులతో అభివృద్ధి పనులు

కొల్చారం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొల్చారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన నెల్లి రాజు సొంత డబ్బులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నారు. శుక్రవారం గ్రామంలో మహిళలకు బతుకమ్మ పండుగ రోజు ఆడుకునేందుకు స్థలాన్ని మరమ్మతులు చేసి, లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. సర్పంచులు లేకపోవడం, పంచాయతీ కార్యదర్శులకు నిధులు రాకపోవడంతో ఆయన ముందుకు వచ్చి పనులు చేపట్టారు. కార్యక్రమంలో స్థానికులు దిలీప్, రాములు, రమేష్ పాల్గొన్నారు.

మెదక్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్


శివ్వంపేట మండలం తిమ్మాపూర్‌లో నీట మునిగిన వరి పంట

మెదక్/నర్సాపూర్/శివ్వంపేట/హవేళీఘణపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాను మరోసారి వర్షం భయపెట్టింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూర్‌లో 8.9 సెం.మీ.లు, శివంపేటలో 7.1 సెం.మీ.లు, మెదక్‌లో 7 సెం.మీ.ల వర్షపాతం నమోదయ్యింది. వాతావరణశాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. సింగూర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేయడంతో ఘనపురం ఆనకట్ట పొంగిపొర్లి ఏడుపాయల వద్ద వనదుర్గ గర్భాలయం వరదలో మునిగిపోయింది. నర్సాపూర్ డివిజన్‌లో చెరువులు, కుంటలు అలుగు పారాయి. నర్సాపూర్ పట్టణంలో 9 వార్డులో ఇళ్ల మధ్య నుంచి వరద నీరు ప్రవహించింది. శివ్వంపేట మండలం చాకరిమెట్లలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలింది. వాగు పొంగడంతో మరోసారి హవేళీఘణపూర్ మండలంలోని దూప్‌సింగ్ తండాకు రాకపోకలు నిలిచిపోయాయి.

చదువుతో విలువ పెరుగుతుంది

తూప్రాన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చదువు, పుస్తక పఠనంతో గౌరవం పెరుగుతుందని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తూప్రాన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన తల్లిదండ్రులు, అధ్యాపకుల మహాసమావేశానికి హాజరై గ్రంథాలయం ప్రారంభించారు. విద్యార్థులు పుస్తక పఠనం చేయాలన్నారు. గ్రంథాలయానికి డీఎస్పీ నరేందర్ గౌడ్ బుక్ రాక్స్‌తో పాటు వివిధ రకాల పుస్తకాలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు అందజేశారు. కమిషనర్ గణేష్‌రెడ్డి భోజన ఏర్పాట్లు చేశారు. ప్రిన్సిపాల్ ప్రభావతి ఆధ్వర్యంలో విద్యార్థినులు బతుకమ్మ ఆటలు ఆడారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

వట్‌పల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వట్‌పల్లిలోని రైతు వేదికలో మండలానికి సంబంధించిన 56 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ జోషి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ కచురావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు


ఏడుపాయలలో వనదుర్గామాతను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు

మహాలక్ష్మి నమోస్తుతే..

న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాలు మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఐదవ రోజు, శుక్రవారం, అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అలంకరణలు నిర్వహించారు. పలుచోట్ల రాజకీయ నాయకులు, ప్రముఖులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.


మెదక్‌లో మహాలక్ష్మీ అవతారంలో భవానీ మాత


పెద్దశంకరంపేటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఘనంగా బతుకమ్మ వేడుకలు



న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎస్పీ శ్రీనివాసరావు పాల్గొని పూజలు చేశారు. నారాయణఖేడ్‌లో సబ్ కలెక్టర్ ఉమాహారతి, మున్సిపల్ ఆధ్వర్యంలో సంబురాలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన శివ్వంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్‌వీ శైలజ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మెదక్ మున్సిపల్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లె బరి.. నేతల గురి..

(మొదటి పేజీ తరువాయి)

మద్యం, మాంసం, చందాల ఖర్చు తడిసిమోపెడవుతుందని తమ గోడు చెప్పుకుంటున్నారు. ఇప్పటికే రెండేళ్లుగా ఖర్చులు భరించి ఇబ్బందులు పడ్డామని.. దీనికితోడు దసరా ఖర్చు తోడైతే కోలుకోలేమని వాపోతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో కాస్త ప్రశాంతంగా ఉన్నామని.. ఖరారైతే ఇక ఖర్చులో మునిగితేలాల్సిందేనని ఓ నాయకుడు తన మనసులో మాట వెల్లడించారు. దసరా తర్వాత రిజర్వేషన్లు ప్రకటిస్తే కొంత ఉపశమనం కలుగుతుందని అంటున్నారు.



1	Mulugu	ST
2	Warangal	ST
3	Khammam	ST
4	Nalgonda	ST

1	Sangareddy	SC
2	Rajanna Sircilla	SC
3	Rangareddy	SC
4	Jangaon	SC
5	Jogulamba Gadwal	SC
6	Vikarabad	SC

1	Siddipet	BC
2	Karimnagar	BC
3	Medchal Malkajgiri	BC
4	Yadadri Bhuvanagiri	BC
5	Nizamabad	BC
6	WARANGAL URBAN	BC
7	Wanaparthy	BC
8	Mahabubnagar	BC
9	Jayashankar	BC
10	Nirmal	BC
11	Suryapet	BC

1	Peddapalli	OC
2	Jagtial	OC
3	Narayanpet	OC
4	Kamareddy	OC
5	Medak	OC
6	Kumuram Adilabad	OC
7	Adilabad	OC
8	Mahabubabad	OC
9	Bhadradri Kothagudem	OC

వైరల్‌గా మారిన జడ్పీ చైర్మన్ల రిజర్వేషన్లు